# వీరపత్ని వెర్సస్ తీవ్రవాది భార్య



*ప్రహారవ్రణ మార్గ విషమే*
*జాయాకృచ్ఛేణలభతేతస్యనిద్రాం*
*గ్రామణీ సుతస్యోరసి*
*పల్లీపానః సాసుఖం స్వపితి*

భావం: దెబ్బలవల్ల కలిగిన గాయాలతో గరుకుగా ఉన్న గ్రామాధికారి కొడుకు వక్షస్థలం మీద పడుకున్న అతని భార్యకు నిద్రపట్టడంలేదు. ఆ పల్లె మాత్రం హాయిగా నిద్రపోతోంది.

కొన్ని సంవత్సరాల క్రిందట పార్లమెంటుమీద దాడి జరిగింది. లోపల ఉన్న దేశ పాలకులను కాపాడే ప్రయత్నంలో రక్షణాధికారులు తమ ప్రాణాలను అర్పించారు. మరణించిన వారిలో ఒక మహిళ కూడా ఉండడం స్త్రీలు గర్వించదగిన విషయం. ఆ దాడికి వెనుకనున్న ప్రధాన హస్తం అప్జల్‌గురుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం మరణశిక్ష విధించింది. ప్రయోజనం లేదు. ఆ తీవ్రవాదికి క్షమాభిక్ష తప్పనిసరి అని అనేక మానవ హక్కుల సంఘాల ఎలుగెత్తి ఘోషిస్తున్నాయి. దేశమాజీ ప్రధాని హత్యకు కారకులైన వారి విషయంలోనూ ఇదే వరస. హంతకుల సంతానమూ, వారి ఆశలూ, ఆశయాలూ చిగర్చకుండానే రాలిపోతున్నాయని ఎలెక్ట్రానిక్ మీడియా కూడా కొన్నిసార్లు వకాల్తా పుచ్చుకుంటోంది. మరణించిన పోలీసు ఉద్యోగుల పిల్లలకు మాత్రం ఆశయాలుండవా? వారి భార్యలకు భర్తలేని దుఃఖముండదా? ఇంతకీ ఈ తీవ్రవాదుల పక్షానవాదించేది మానవ హక్కులకా లేక దానవ హక్కులకా?

తీవ్రవాదులూ, దోపిడీదార్లూ, హంతకులూ ప్రపంచంలో ఎప్పుడూ ఉన్నారు. వారినుంచి అమాయక ప్రజానీకాన్ని కాపాడడం పాలకుల బాధ్యత. అయితే ప్రాచీన భారతదేశంలో సానుభూతి రక్షకుల కుటుంబం మీదనే ఉండేదనడానికి పై పద్యం ఉదాహరణ. గ్రామంమీద దొంగలుపడి దోచుకునే వారు లేదా పొరుగురాజులు దండెత్తేవారు. ఆ సమయంలో గ్రామాన్ని కాపాడడం అధికారి బాధ్యత. అతడు వృద్ధుడైతే కుమారుడు యుద్ధం చేసేవాడు. రక్షణ బాధ్యతలో అతని శరీరంమీదగాయాలై గరుకుగా తయారయ్యేది.

అటువంటి వీరుడి భార్య మనస్సు ఎల్లప్పుడూ భయపడుతూనే ఉంటుంది. ఏ క్షణం యుద్ధానికి భర్త వెడతాడో, అతనికి ఏమవుతుందోనన్న భయంతో ఆమెకు నిద్ర కూడా పట్టదు. కానీ ఆ మహావీరుడి అండదండలున్నాయన్న ధైర్యంతో గ్రామ ప్రజలందరూ హాయిగా నిద్రపోగలరు.

ప్రాచీన కాలంలో మేధావుల సానుభూతి దేశరక్షకుల కుటుంబాలపైనే ఉండేదని మనం తెలుసుకోవచ్చును. దేశ భక్షకుల మీద ఉంటే దేశమేమయ్యేదో మనకి తెలియనిదీ కాదు. ప్రభుత్వాదాయంలో సగం దేశరక్షణకు వినియోగించాలన్నది రాయలవారి రాజనీతి. అటువంటి నమ్మకాలుండడంవల్లనే ఆనాటి భారతీయులు మహోన్నత సామ్రాజ్యాలను స్థాపించగలిగారు. విదేశాలతో తమదే పైచేయిగా వాణిజ్యం సాగించగలిగారు. కీర్తి పతాకలను నలుదిశలా ఎగురవేయగలిగారు. మానవ హక్కుల పోరాటం మంచిదే. ఏ మానవులకై పోరాడాలన్నదే ప్రశ్న.

******